తొందర వద్దు.. విజ్ఞతే ముద్దు!



ప్రైవేటు స్కూల్ బస్సు

- ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చేర్చే విషయంలో అప్రమత్తత అవసరం
- నిబంధనలపై దృష్టి సారించాలి
- మౌలిక సదుపాయాలు, బస్సుల ఫిట్‌నెస్‌పై అవగాహన తప్పనిసరి

టెక్కలి: వేసవి సెలవులు మరికొద్ది రోజుల్లో ముగిసి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో తమ పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలో తెలియక తల్లిదండ్రులు తికమక పడుతుంటారు. ప్రధానంగా ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే విషయంలో అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. పాఠశాలకు అన్ని రకాల నిబంధనలు, గుర్తింపులు ఉన్నాయా లేదా అనే విషయమై తల్లిదండ్రులు తెలుసుకోవాలి. లేకపోతే తరువాత అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించే విషయంలో హంగు.. ఆర్భాటాలను చూసి మోసపోవద్దంటున్నారు. టెక్కలిలో ఈ నెల ఏడో తేదీన అనుమతిలేని ఓ ప్రైవేటు పాఠశాలకు అధికారులు తాళాలు వేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

నిబంధనలు ఇలా..

- నిబంధనల ప్రకారం ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరి. అలాగే అన్ని వసతులు కల్పించాలి. భవనాలు కూడా అదే తరహాలో ఉంటేనే ప్రభుత్వం గుర్తింపు సంఖ్యను కేటాయిస్తుంది. ఈ పత్రాన్ని ప్రదర్శించాలి. లేదంటే విద్యాశాఖ వెబ్‌సైట్‌లో గుర్తింపు పొందిన బడుల వివరాలను పొందుపరుస్తుంది. ఈ అంశాలను పరిశీలించాకే పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తే మంచింది.



టెక్కలిలో అనుమతిలేని ప్రైవేటు పాఠశాలకు తాళాలు వేస్తున్న అధికారులు (ఫైల్)

పాఠశాల ఆవరణ, తరగతి గదులు విశాలంగా ఉన్నాయా లేదో సరిచూసుకోవాలి. లేకుంటే అనుకొని సంఘటన (అగ్ని ప్రమాదం) జరిగితే మంటలు ఆర్పేందుకు అన్ని పరికరాలు ఉన్నాయా లేదా అన్న విషయంపై ఆరా తీయాలి. అగ్నిమాపక శాఖ నుంచి సైతం అనుమతి పొంది ఉండాలి. పాఠశాలల్లో బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన వారినే ఉపాధ్యాయులుగా నియమించుకోవాలి. ఆయా అర్హతలు ఉన్నవారు ఉన్నారా? లేరా? అని ఆరా తీయడం మరువొద్దు. అన్నింటి కంటే ఇదే ప్రధానం. ఆటలు ఆడించేందుకు పీఈటీ సైతం ఉండాలి. ఫీజులు నిబంధనల ప్రకారం ఉన్నాయో..లేదో తెలుసుకుంటే భవిష్యత్తులో ఇబ్బంది ఉండదు. మండల స్థాయిలో విద్యాశాఖ అధికారులను సంప్రదించి అనుమతులు, ఇతర విషయాలను తెలుసుకోవాలి. ప్రైవేటు పాఠశాలలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మకూడదు. స్వయంగా తల్లిదండ్రులు వెళ్లి ఆరా తీయడం మంచిది.

- బస్సుల విషయంలో అప్రమత్తత అవసరం..

ప్రైవేట్ పాఠశాలల బస్సుల విషయంలో మరింత జాగ్రత్తగా తల్లిదండ్రులు వ్యవహరించాలి. విద్యా సంస్థకు చెందిన బస్సుకు ఎడమ వైపున, ముందు భాగంలో ఆయా పాఠశాల, కళాశాల పేరు, టెలిఫోన్ నంబర్, మొబైల్ నెంబర్‌తో సహా పూర్తి చిరునామా ఉందోలేదో పరిశీలించాలి. డ్రైవర్‌గా నియమించబడే వ్యక్తి వయస్సు 60 సంవత్సరాల లోపు ఉండాలనే విషయాన్ని మరిచిపోవద్దు. అన్నిటికంటే బడిబస్సు ఫిట్‌నెస్‌ను కచ్చితంగా తెలుసుకోవాలి. అందుకు సంబంధించి రవాణా శాఖ అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్‌ను పరిశీలించాలి.

అన్ని అనుమతులు ఉండాలి



ప్రైవేట్ విద్యా సంస్థల్లో పిల్లలను చేర్పించే విషయంలో తల్లిదండ్రులు విజ్ఞతతో వ్యవహరించాలి. అన్నిరకాల అనుమతులపై వాకబు చేయాలి. ముఖ్యంగా విద్యా శాఖ నిబంధనల మేరకు పాఠశాలను నిర్వహిస్తున్నారా లేదా అనే విషయాన్ని తెలుసుకోవాలి. ఇవన్నీ పక్కన పెడితే ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో పాఠశాలలు నిర్వహిస్తున్నారనే విషయాన్ని తెలుసుకోవాలి.

–డి.తులసీరెడ్డి, ఎంఈవో, టెక్కలి

నిబంధనలను తెలుసుకోవాలి



ప్రైవేట్ విద్యా సంస్థల్లో పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులంతా ఆయా బస్సులకు రవాణా శాఖా నిబంధనలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని కచ్చితంగా తెలుసుకోవాలి. కొన్ని సందర్భాల్లో ఎటువంటి నిబంధనలు లేకుండా బస్సులు రాకపోకలు సాగిస్తే ఆయా యజమాన్యాన్ని నిలదీయవచ్చు. రవాణా శాఖాధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

– డి.సంజీవరావు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, టెక్కలి

క్లుప్తంగా

సిమెంట్ బెంచీలు వితరణ



జి.వి.రెడ్డి మాస్టార్ కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు

టెక్కలి: రావివలస గ్రామానికి మేధావుల ఫోరం అధ్యక్షుడు జి.వి.రెడ్డి మాస్టార్ తనవంతుగా సిమెంట్ బెంచీలను ఆదివారం అందజేశారు. గ్రామంలోని మల్లన్న ఆలయానికి వచ్చే భక్తులతో పాటు గ్రామస్తులకు అందుబాటులో ఉండే విధంగా ఈ బెంచీలను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామ సర్పంచ్ సర్లాన బాలకృష్ణతో పాటు గ్రామస్తులు రెడ్డి మాస్టార్ కుటుంబ సభ్యులను సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.

యోగాపై అవగాహన



యోగాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టెక్కలి: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా టెక్కలి విశ్రాంత ఉద్యోగుల భవనంలో రిటైర్డు ఉద్యోగులకు యోగాపై ఆదివారం అవగాహన కల్పించారు. సాయి కృష్ణా యోగా కేంద్రం గురువు జి.చంద్రశేఖర్‌తోపాటు కేంద్రం సభ్యులు నందా, ఎస్.ఉషారాణి, ఆయుష్ డాక్టర్ ప్రవీణ్ తదితరులు యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్.రామచంద్రరావు, పి.హరిశ్చంద్రరావు, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

పల్లా మృతికి సంతాపం

కాశీబుగ్గ: విశాఖకు చెందిన మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మరణం యాదవ సామాజిక వర్గానికి తీరని లోటని అఖిల భారతీయ యాదవ మహాసభ శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు రాపాక చిన్నారావు యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సింహాచలం మృతికి సంతాపం తెలియజేశారు. శ్రీకాకుళం జిల్లా నుంచి వలస వెళ్లిన యాదవులకు విశాఖలో ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు జీవనోపాధి చూపించారని గుర్తు చేశారు. యాదవ సామాజిక వర్గానికి ఆయన చేసిన సేవలు మరువలేనవని అన్నారు.

అమ్మవారి పండుగ నిర్వహణపై సమావేశం



సమావేశమైన గ్రామ కమిటీ సభ్యులు

పలాస: టెక్కలిపట్నం గ్రామదేవత అమ్మవారి పండుగను విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని గ్రామ కమిటీ తీర్మానం చేసింది. 2026 మే ఎనిమిదో తేదీ నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం గ్రామంలో గ్రామ సభ నిర్వహించి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఉత్సవాల నేపథ్యంలో మెయిన్ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించాలని, రోడ్డుకు ఇరువైపులా అందంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. వ్యాపార సముదాయాలపై రాబోయే సమావేశంలో చర్చించి తగిన నిర్ణయాలను తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ మళ్లించడానికి వేరే మార్గాన్ని ఏర్పాటు చేయాలని మరో తీర్మానాన్ని చేశారు. గ్రామ పెద్దలు ఉంగ సాయిక్రిష్ణ, పాలిన క్రిష్ణారావు, చాపర సుందరలాల్, వైద్య భూషన్ క్రిష్ణారావు, హనుమంతు వైకుంఠరావు, చంద్రశేఖర్ అధికారి, పాలిన మల్లేశ్, పాలవలస రామక్రిష్ణశర్మ, రత్నాల జగన్నాథరావు, తిప్పాన సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థికి సత్కారం



భరద్వాజ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కవిటి: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో 860 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చిన కవిటికి చెందిన మొగిలిపురి భరద్వాజ్‌ను సొండికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను విద్యార్థికి అందజేసి అభినందించారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ట



ఆలయ ప్రతిష్టలో భక్తులు

మందస: ముకుంద పురం గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ట వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కుంకుమ పూజల్లో అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ఘనంగా నిమ్మశిని అమ్మవారి ఆలయ ప్రతిష్ట



అమ్మవారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు దంపతులు

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన నిమ్మాశిని అమ్మవారి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు శని, ఆదివారాల్లో ఘనంగా జరిగాయి. ఆదివారం జరిగిన కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, దంపతులు, స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప తదితరులు పాల్గొని పూజలు చేశారు. స్థానిక సర్పంచ్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం ఉన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

సోంపేట: సోంపేట ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ పరీక్షల్లో సత్తాచాటారు. పదో తరగతి విద్యార్థిని దవళ ఈశ్వరి షైనింగ్ స్టార్ అవార్డును సొంతం చేసుకుంది. ఈ అవార్డు కింద రూ. 20 వేలు నగదు పారితోషకం అందుకోనుంది. అలాగే ఎనిమిదో తరగతి విద్యార్థిని దండాసి దీప్తి ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికై ంది. విద్యార్థినులను ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ, అధ్యాపక సిబ్బంది అభినందించారు.



దవళ ఈశ్వరి



దండాసి దీప్తి

బోరుబావులకు శంకుస్థాపన

కవిటి: కపాసుకుద్ది పంచాయతీ కొరికానపుట్టుగ, సూరివీధి గ్రామాల్లో జెడ్పీ, మండల పరిషత్ నిధులు సుమారు రూ. ఐదు లక్షల వ్యయంతో రెండు విద్యుత్ మోటార్ బోరుబావుల ఏర్పాటుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.ప్రకాష్, సర్పంచ్ కె.దమయంతి, ఎంపీటీసీ సభ్యురాలు టి.పార్వతి, కె.భీమసేన్, పి.శ్రీరాములు, పి.వెంకటరావు, కొరికాన ధనం, నర్తు లక్ష్మణ్ పాల్గొన్నారు.



కొరికానపుట్టుగలో శంకుస్థాపన చేస్తున్న నాయకులు

రూ. 50 వేల ఆర్థిక సాయం

కవిటి: సీహెచ్ కపాసుకుద్ధికి గ్రామానికి చెందిన ఆర్.రుద్రయ్య గుండె సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చేరాడు. శస్త్రచికిత్సకు పది లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న కవిటి ప్రభుత్వ పాఠశాలలో 2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న రుద్రయ్య స్నేహితులు స్పందించారు. 50 వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడికి ఆదివారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు.

శ్యామలమ్మ అమ్మవారికి పూజలు

కవిటి: పొందూరుపుట్టుగలో వెలసిన శ్యామలమ్మ అమ్మవారి ఆలయ ప్రతిష్ట ఆదివారం ఘనంగా జరిగింది. శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యువకుల ఔదార్యం

సోంపేట: తాళభద్ర గ్రామానికి చెందిన ప్రకాశరావు ఇటీవల మృతి చెందారు. వీరిది నిరుపేద కుటుంబం. భార్య దివ్యాంగురాలు కావడంతో గ్రామానికి చెందిన యువసేనా సంఘం సభ్యులు అండగా నిలిచారు. రూ. పది వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి ఆదివారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. సంఘ ప్రతినిధులు చంద్రరావు, పూర్ణచంద్రరావు ఉన్నారు.

విత్తనాల కోసం ఎదురుచూపులు!



వెలవెలబోతున్న బొడ్డపాడు రైతు సేవా కేంద్రం

పలాస: వర్షాలు కుర్తుసుండడం, ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తనాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. పలాస మండలంలో 10,291 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ఇందుకోసం సుమారు 1500 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం ఉంది. అయితే ఇంతవరకు విత్తనాలు రైతులకు అందుబాటులోకి రాలేదు. వ్యవసాయ అధికారులకు ఈ విషయం అడుగుతుంటే 1088.25 క్వింటాళ్ల కోసం ఇండెంటు పెట్టామని.. అవి వస్తే రైతులకు సరఫరా చేస్తామని చెబుతున్నారు. అయితే అవి ఎప్పుడు వస్తాయో తెలియక రైతులు ఆందోళనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో సకాలంలో నాణ్యమైన విత్తనాలు రైతుల ముంగిటకే వచ్చి వాలేవని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని నిరాశ వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఉపయోగపడాల్సిన రైతు భరోసా కేంద్రాలు పేరు మార్చుకొని వెలవెల బోతున్నాయి.



నారుమడిని సిద్ధం చేస్తున్న రైతులు

ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేయాలి



గత ప్రభుత్వం లాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు సరఫరా చేయాలి. గతంలో సకాలంలో నాణ్యమైన వరి విత్తనాలు అందేవి. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం వర్షాలు బాగున్నాయి. నారు మడులను సిద్ధం చేస్తున్నాము. విత్తనాలు ఎప్పుడు వస్తాయో తెలియదు.

– దువ్వాడ రవి, రైతు,అల్లుకోల, పలాస మండలం

ప్రతిపాదనలు పంపించాం



1088.25 క్వింటాళ్ల విత్తనాల ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. వీటిలో ఎంటీయూ 1061 రకం 196.2 క్వింటాళ్లు, 7029 రకం 322.3, బీపీటీ 5204 రకం 278, ఆర్‌జేఎల్ 2537 రకం 81.5 క్వింటాళ్ల కోసం విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపించాము. వచ్చిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తాం.

– పోలారావు, వ్యవసాయ విస్తరణాధికారి, పలాస మండలం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పలాస ఆర్డీవో గ్రంధి వెంకటేశ్వరరావు అన్నారు. కంచిలి మండలం మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమంలో ఆదివారం ఏర్పాటు చేసిన యోగాంధ్ర-2025 కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్డీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగాసనాలు వేస్తూ ఆవశ్యకతను వివరించారు. తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్, ఎంపీడీవో వి.తిరుమలరావు, పలువురు ఉద్యోగులు, ఆశ్రమ నిర్వాహకుడు రమేష్‌కుమార్, మోహనరావు పాల్గొన్నారు.

-కంచిలి

అధ్వాన రోడ్డుతో అవస్థలు



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 20వ వార్డు శివాజీనగర్ నుంచి సూదికొండను కలిపే లింకు రోడ్డు అధ్వానంగా తయారైంది. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సూదికొండకు జీడి కార్మికులు రాకపోకలకు దీన్నే వినియోగిస్తుంటారు. అలాగే ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలకు ఇదే ఆధారం. ఎంతో ప్రాధాన్యం ఉన్న రోడ్డు శిథిలమైంది. చిన్నచినుకుపడినా నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు స్పందించి సీసీ రోడ్డుగా మార్పుచేసి కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

-కాశీబుగ్గ

మండపం నిర్మాణానికి శంకుస్థాపన



మందస కేంద్రంలోని రావిచెట్టు మండపం పునః నిర్మాణానికి భోయి వీధి యువత శ్రీకారం చుట్టింది. 60 ఏళ్ల క్రితం నిర్మించిన మండపం శిథిలమైంది. గ్రామస్తులు ఎలాంటి శుభకార్యక్రమాలు చేపట్టాలన్నా రావిచెట్టుకు పూజలు చేసి ప్రారంభించడం ఆనవాయితీ. అయితే మండపం శిథిలావస్థకు చేరుకోవడంతో పునఃనిర్మాణం చేపట్టాలని భావించిన యువత శనివారం శంకుస్థాపన చేశారు. సూమారు రూ. 90 వేలతో దీన్ని నిర్మించనున్నారు. మందస మేజర్ పంచాయతీ సర్పంచ్ చెరుకుపల్లి ఎల్లమ్మ, గ్రామ పెద్ద లక్ష్మణరావు పాల్గొన్నారు.

-మందస

అమ్మవార్లకు చల్లదనం పూజలు



కొత్తవరకలో అమ్మవారి గజముద్దను మోస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ



కళాకారుల కోయడ్యాన్స్ ప్రదర్శన

కవిటి: కొత్తవరక గ్రామంలోని అన్నపూర్ణేశ్వరి, బిగొనపపుట్టుగలోని బాలామణి అమ్మవార్లకు ఆయా గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో చల్లదనం పూజలను ఆదివారం ఘనంగా చేశారు. కొత్తవరకలో జరిగిన అమ్మవారి సేవలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బాలామణి అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి పంటపొలాల సమీపంలోని గుడిలో మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



బిగొనపపుట్టుగలో బాలామణి అమ్మవారి ఊరేగింపు

రాయితీపై పశుదాణా పంపిణీ

కాశీబుగ్గ: రాయితీపై అర్హులైన పాడి రైతులకు పశుదాణా అందజేస్తున్నామని పశువైద్యాధికారి కె.మధుబాబు అన్నారు. పలాస మండలం లొద్దబద్ర రైతు సేవా కేంద్రంలో ఆదివారం పాడి రైతులకు పశుదాణాను పంపిణీ చేశారు. దాణా కావాల్సిన పాడిరైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వంకల కూర్మారావు, గ్రామ పెద్దలు బి.శంకరరావు, ఎస్.సింహాచలం, పిట్ట తాతారావు, గోపాలమిత్ర డి.రామారావు పాల్గొన్నారు.



పశుదాణా పంపిణీ చేస్తున్న దృశ్యం

‘కొంప’ ముంచుతున్న సీసీ రోడ్డు!

ఇచ్ఛాపురం రూరల్: ఇలా రోడ్లు వేస్తే.. అలా బిల్లులు అయిపోతున్నాయన్న అనందంలో కూటమి వెండర్స్ ఇష్టారీతిలో వ్యవహరిస్తున్నారు. ఏడాపెడా సీసీ రోడ్లు వేయడంతో చినుకు పడితే చాలు ప్రజల ‘కొంప’లు కొల్లేరవుతున్నాయి. ముచింద్రం గ్రామంలోని పెద్ద వీధిలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సీసీ రోడ్డు ఉన్నప్పటికీ, బిల్లులు వస్తాయన్న ఆశతో స్థానిక కూటమి నాయకులు అదే రోడ్డుపై వంద మీటర్ల వరకు సగం రోడ్డు వేసి వదిలేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో నీరు ఎటూ వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో చెరువులను తలపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం స్థానిక వెండర్‌ను స్థానికులు నిలదీయగా.. కొత్త రోడ్డు వస్తే వేస్తామని, అంత వరకు పరిస్థితి ఇలానే ఉంటుందని చెప్పడంతో ప్రజలు అవాక్కై య్యారు. ఉన్న రోడ్డుపై రోడ్డు వేసి ఇలా మాకు నరకాన్ని చూపిస్తున్నారని, రాత్రి సమయాల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంపల ముందు నిల్వ ఉంటున్న వరద నీటిని తోడుకోలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



ఇళ్ల ముందు చేరిన వర్షం నీటిని బక్కెట్లతో తోడుతున్న మహిళలు